క్లుప్తంగా...

మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ

మేడ్చల్: మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు భారతీయ స్టేట్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చిల్కూరులో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. టైలరింగ్, సెల్‌ఫోన్ రిపేరు చేయడం, మగ్గం వర్క్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

లెదర్ ప్రొడక్ట్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణలో గ్రామస్తులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సీఎఫ్‌సీ ఆధ్వర్యంలో లెదర్ ప్రొడక్ట్స్‌పై నిర్వహిస్తున్న రెండు వారాల శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చిన్న మునగల గ్రామానికి చెందిన 80 మంది పాల్గొనగా వారికి లెదర్ వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం వారికి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ద్వారా సహకారం అందజేయనున్నట్లు ప్రాజెక్టు పీఐ మోహన్‌రావు, కో పీఐ మనీష్, సీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూర్ పురోహితుడికి నంది పురస్కారం



నంది పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్ శర్మ

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన పురోహితుడు కలగ వెంకటేశ్‌శర్మకు నంది పురస్కారం దక్కింది. శ్రీ త్రినయన సాంస్కృతిక కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని త్యాగరాయ గానసభలో ఉగాది నంది పురస్కార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పూడూర్‌కు చెందిన వెంకటేశ్‌శర్మకు నంది పురస్కారాన్ని అందజేశారు. సాంస్కృతిక సేవా సంస్థ స్థాపక కార్యదర్శి శివకుమార్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేవంతెన పనులను వేగవంతం చేయాలి



చీఫ్ ఇంజినీర్‌కు వినతి అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, జంగయ్యయాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ సతీష్ కుమార్‌కు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్యయాదవ్ వినతి పత్రం అందజేశారు. ఏళ్లుగా వంతెన పనులు కొనసాగుతున్నాయని, జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్ స్థానంలో నూతనంగా మరొకరికి అప్పగించాలని శుక్రవారం చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే వంతెన నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లించే విషయమై జూన్ మొదటి వారంలో ఆర్డీఓ సమావేశం అవుతారని గుర్తు చేశారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మేడ్చల్‌రూరల్: గుట్టుచప్పుడు కాకుండా ఓ మామిడి తోటలో పేకాట ఆడుతుండగా మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు పేకాట స్థావరంపై దాడులు చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నూతన్‌కల్ గ్రామ పరిధిలోని ఓ మామిడి తోటలో నగర శివారు ప్రాంతాలకు చెందిన కొంతమంది గత గురువారం రాత్రి పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారంతో మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.55 వేల నగదు, 8 సెల్‌ఫోన్లు, 4 కార్లు స్వాధీనం చేసుకుని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి వారిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

వృద్ధ తల్లిదండ్రులను విస్మరిస్తే..

కటకటాలే..!



కుమారులు ఇబ్బందులు పెడుతున్నారని జవహర్‌నగర్ పీఎస్‌ను ఆశ్రయించిన వృద్ధుడు

- వయోవృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చట్టం
- వారసుల వికృత చేష్టలకు అడ్డుకట్ట
- డివిజన్ స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు
- రోడ్డుపై వదిలేసినా క్రిమినల్ కేసులు



జవహర్‌నగర్: తల్లిదండ్రుల తర్వాతే దైవం కూడా.. ప్రత్యక్ష దైవాలైన వీరు మలిసంధ్యలో పడరాని పాట్లు పడుతున్నారు. పిల్లలను పెంచి పెద్ద చేసి వారి బంగారు భవిష్యత్ కోసం శ్రమిస్తే వృద్ధాప్యంలో వారిని పట్టించుకోవడం లేదు. రెక్కలొచ్చిన కొడుకులను కన్నవారు బరువైపోతున్నారు. రక్త సంబంధాన్ని తెంచేసుకుని ముసలి తల్లిదండ్రులను రోడ్డుపై వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇటువంటి ఘటనలు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. అయితే ఇలాంటి వాటికి చెక్ పెడుతూ ప్రభుత్వం డివిజన్ స్థాయిలో ఓ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. వృద్ధులైన తల్లిదండ్రులను వీధిపాలు చేస్తే కొడుకులు కటకటాలు లెక్కపెట్టాల్సిందే.

వృద్ధులను వదిలేస్తే క్రిమినల్ కేసులు

వృద్ధుల సంపూర్ణ బాధ్యత ఉన్న వ్యక్తులెవరైనా అందుకు విరుద్ధంగా శాశ్వతంగా వదిలించుకునే ఉద్దేశ్యంతో ఏదైనా ప్రదేశంలో విడిచిపెట్టినా, వారికి హాని తల పెట్టినా 3 నెలల జైలు శిక్ష లేదంటే రూ.5 వేల జరిమానా విధిస్తారు. ఒక్కోసారి రెండూ అమలు కావచ్చు. ఇటువంటి కేసులను పోలీస్‌శాఖ చూసుకుంటుంది.

సహాయ కేంద్రం ఇదే..

వయోవృద్ధుల సహాయార్థం జిల్లా కేంద్రంలో హెల్ప్‌లైన్ నంబర్: 14567ను ఏర్పాటు చేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, కీసర రెవెన్యూ డివిజన్ అధికారి ఫోన్ నెం. 79950 73744 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

వృద్ధాశ్రమంలో చేర్పించి..

కోట్లు సంపాదించి ఇచ్చిన తల్లిదండ్రులకు తనయులు పట్టెడు అన్నం పెట్టడంలేదు. అయిన వారికి దూరంగా.. భారంగా ఉంటూ జీవనం గడుపుతున్న వారి గాధలు కన్నీళ్లు తెప్పించక మానవు. జీవిత చరమాంకంలో ఆదుకోవాల్సిన తనయులు చేతులు దులుపుకుంటున్నారు. వయోభారంతో వృద్ధులు అవస్థలు పడీ విసిగిపోయి న్యాయం కోసం పోరాడుతున్నారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొందరు కుమారులు తెలివిగా వృద్ధాశ్రమంలో చేర్పించి చేతులు దులుపుకుంటున్నారు.

ఎవరికి ఫిర్యాదు చేయాలి?

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కలెక్టర్ డివిజన్ల వారీగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. అక్కడ డివిజన్ ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారు. వృద్ధుల సంఘం నుంచి ఒక ప్రతినిధి, కౌన్సిలేషన్ అధికారి ఉంటారు. సంబంధిత డివిజన్ కార్యాలయంలో వృద్ధులు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆర్డీవో సంబంధిత తహసీల్దార్‌కు విచారణ కోసం ఆదేశిస్తారు. ఇరువర్గాలను పిలిచి వాదనలు విని న్యాయం చేస్తారు. వినని పక్షంలో కౌన్సిలేషన్ అధికారికి అనుసంధానం చేస్తారు. ఆయన ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తారు. ఒకవేళ న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా అప్పిలేట్ అధికారి కలెక్టర్‌ను ఆశ్రయించవచ్చు. వృద్ధులే కాకుండా ఎన్జీవోలు కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసేవారు ఎవరైనా నిర్ణీత ఫారంను పూర్తిచేసి డివిజన్ రెవెన్యూ అధికారికి అందించాలి.

వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007

వారసుల వికృత చేష్టలకు అడ్డుకట్ట వేస్తూ వృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఓ చట్టాన్ని అమలు చేస్తోంది. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం -2007ను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కన్నవారిని విస్మరిస్తే ఇక జైలు కూడు తినాల్సిందే. మలిసంధ్యలో ఆదరించాల్సిన కుమారులు వారిని పట్టించుకోకపోతే ఈ చట్టం తీవ్రంగా పరిగణిస్తుంది.

ఎవరికి వర్తిస్తుంది..?

ఈ చట్టం దేశమంతా వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం తల్లి, తండ్రి, సవతి తండ్రి/తల్లిని వయోవృద్ధుల కింద పరిగణిస్తారు. ఆస్తి ఉన్నవారు, వారసత్వంగా పొందుతున్న వారు, బంధువులు, చట్టంలో పేర్కొన్న ప్రకారం స్థిర, చర, వారసత్వ,స్వార్జిత ఆస్తులు తదితరాలపై వయోవృద్ధులకు హక్కు ఉంటుంది.

ప్రయోజనం ఇలా..

సొంత సపాదనతో తమను తాము పోషించుకోలేని వృద్ధులు, తల్లదండ్రులు ఈ చట్ట ప్రకారం తమ పిల్లలను వారి పోషణ గురించి అడగవచ్చు. సొంత సంపాదనతో తమను తాము పోషించుకోలేని సంతానం లేని వృద్ధులు వారి ఆస్తిని అనుభవించే బంధువులను పోషణ గురించి అడగవచ్చు. పోషణ ఖర్చులో ఆహారం, దుస్తులు, నివాసం, వైద్య సహాయం, చికిత్సకు అవసరమైన మొత్తం నెలకు రూ.10 వేలకు మించకుండా పోషణ నిమిత్తం అందేలా ట్రిబ్యునల్ చర్యలు తీసుకుంటుంది.

పత్రికా కథనాలపై సమగ్ర విచారణ

వివిధ దినపత్రికల్లో వచ్చే వృద్ధుల కథనాలను సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం పత్రికల్లో వచ్చే కథనాలను కత్తిరించి సంబంధిత తహసీల్దార్‌లకు సమాచారం ఇస్తుంది. తహసీల్దార్ వాస్తవ నివేదికను రూపొందించి ఆర్డీవోకు నివేదిస్తారు. ఇరు వర్గాలను పిలిచి రాజీ కుదర్చడమో, కేసు నమోదు చేయడమో నిర్ణయిస్తారు.

235 కేసులను పరిష్కరించాం



మలి వయస్సులో ఉన్న తల్లిదండ్రులకు వారసులుగా తోడుగా ఉండాలి. వారిని నిర్లక్ష్యం చేయకుండా సంరక్షించాలి. అనవసరంగా ఫిర్యాదుల వరకు తెచ్చుకోకూడదు. వృద్ధులు కూడా తప్పుడు ఫిర్యాదులు చేస్తే ఉపేక్షించం. ఇప్పటి వరకు 235 కేసులను పరిష్కరించాం. మరికొన్ని పరిష్కరించాల్సి ఉంది.

- రవి, కీసర ఆర్డీవో

నిర్లక్ష్యం వహిస్తే కటకటాలపాలే..



వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత కుమారులది. పిల్లలను పెంచి పెద్ద చేసి వారి బంగారు భవిష్యత్ కోసం శ్రమిస్తే వృద్ధాప్యంలో వారికి తోడుగా నిలవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది. వారిని నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారికి హాని తలపెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- సీతారాం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జవహర్‌నగర్

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య యాదవ్, కమిషనర్ వేమనరెడ్డి

ఘట్‌కేసర్: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను కమిషనర్ వేమనరెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. చైర్ పర్సన్ పర్యావరణ పరిరక్షణ కోసం వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగం, రీసైకిల్ చేయడంపై వార్డులో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, రోడ్లపై నీరు నిల్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విజయ్ ముదిరాజ్, సాయి, కుతుబ్, సన్నీ, రాజేశ్, హబీబ్, సలీం, జహంగీర్, అస్లాం, ఫయూమ్ పాల్గొన్నారు.



హనుమాన్‌నగర్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

ఆర్ఆర్ఆర్ కార్యక్రమానికి స్పందన

కీసర: మేరా లైఫ్–మేరా స్వచ్ఛ షెహర్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న రెడ్యూస్, రీయూస్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్) కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభిస్తోందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమాన్‌నగర్ కాలనీలో ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో భాగంగా వినియోగంలో లేని వస్తువులను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ మున్సిపాలిటీగా నాగారంను మార్చేందుకు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనమే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పోచారం: అన్నోజిగూడలోని శ్రీవిద్యా విహార్ హైస్కూల్ ఆవరణలో ఆర్ఎస్ఎస్ ప్రథమవర్ష శిక్షణ సార్వజనికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ తీసుకొన్న వారిచే శారీరక ప్రదర్శనలు చేయించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్నుల శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ కె.సాంబిరెడ్డి మాట్లాడుతూ.. నిబద్ధతకు నిదర్శనమే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అని ప్రశంసించారు. ముఖ్యవక్తగా రామ్‌భారత్ మాట్లాడుతూ.. అన్ని దేశాలతో సత్సంబంధాలను పెంచుకుంటూ మన దేశం అభివృద్ధి చెందాలని కోరుకుంటోందన్నారు. ఇతర దేశాలను అణగదొక్కి అభివృద్ధి చెందాలన్న ధోరణి మన దేశానికి లేదన్నారు. మత మార్పిడి చేసుకున్న వారికి రిజర్వేషన్లు వర్తించవని అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వర్గ అతిథి చల్లా వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో 'కంటి వెలుగు'ప్రారంభం



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ భవానిగౌడ్

మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్ ప్రారంభించారు. వార్డు ప్రజలు శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారు కంటి అద్దాలు, మందులు తీసుకోవాలని ఆమె కోరారు. ఐదు రోజుల పాటు సాగే శిబిరాన్ని కంటి సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీడింగ్ కళ్ల జోళ్లు అవసరమైన వారికి పంపిణీ చేశారు.

హామీలు తప్ప.. అమలు చేసింది లేదు..

ఘట్‌కేసర్: హామీలు తప్ప అమలు చేసింది లేదని, నెల రోజుల కావొస్తున్నా రైతులకు టోకెన్లు ఇవ్వలేదని, కొనుగోళ్లు నిలిచిపోవడంతో అకాల వర్షాలకు కుప్పలుగా ఉన్న ధాన్యం తడిసిపోతోందని, తక్షణమే కుప్పల్లోని ధాన్యం కొనుగోలు చేయాలని ఎంపీటీసీలు రవి, శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామన్న సీఎం కేసీఆర్ హామీని అధికారులు బుట్టదాఖలు చేశారని విమర్శించారు. ధాన్యం కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో 25 రోజులుగా రైతులు దినదినగండంగా గడుపుతున్నారన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

ముఖ్యఅతిథి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. రైతుల సమస్యలు కలెక్టర్, డీసీఎంఎస్ అధికారులు సంయుక్తంగా పరిష్కరిస్తారని, అన్నదాతలు దిగులు పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ జంగమ్మ, జిల్లా గ్రంథాలయం చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీటీసీలు శోభారాణి, రవి, సరళ, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

నేడు రక్తదాన శిబిరం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల దాతలు టౌన్‌షిప్‌లోని నిమ్స్ క్లినిక్ వద్దకు రావాలని నిర్వాహకులు కోరారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



సాయిమహిమకాలనీలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులోని సాయి మహిమకాలనీలో శనివారం కొత్తగా నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, కోశాధికారి ప్రణయ్ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థుల గంజాయి దందా

కీసర: గంజాయి విక్రయిస్తున్న స్థావరంపై శుక్రవారం ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ బృందం కీసర పోలీసులతో కలిసి దాడి చేశారు. దాదాపు 2 కిలోల గంజాయి, ఒక బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాంపల్లిలోని బీరప్పదేవాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు అందిన పక్కా సమాచారంతో గంజాయి విక్రయ స్థావరంపై దాడిచేసి సుమారు రూ.లక్ష విలువచేసే గంజాయిని పట్టుకున్నారు. దుప్పనపూడి లోకేష్, సాయిశంకర్, రాసమల్ల మధుమోహన్, కోడాలి కిరణ్‌కుమార్‌ను ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి కీసర పోలీసులకు అప్పగించారు. కాగా గంజాయి సరఫరా చేసే ప్రధాన నిందితుడు మోహన్ అలియాస్ ప్రణీత్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. నిందితులంతా బీటెక్ విద్యార్థులని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రపతిని అవమానిస్తున్న బీజేపీ ప్రభుత్వం

శామీర్‌పేట్: భారత ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బీజేపీ ప్రభుత్వం అవమానిస్తోందని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్ అన్నారు. భారత పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి పిలవకుండా అవమానిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం శామీర్‌పేట మండలకేంద్రంలోని బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, మేడ్చల్ మండల ఎస్టీ అధ్యక్షుడు ఆకాష్‌నాయక్ పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

దూడను కాపాడబోయి.. కాపరి గల్లంతు

డీఆర్ఎఫ్, అగ్నిమాక సిబ్బందితో గాలించినా ఫలితం శూన్యం



శంకరయ్య(ఫైల్)

శామీర్‌పేట్: దూడను కాపాడబోయి కాపరి గల్లంతయ్యాడు.. ఈ ఘటన శుక్రవారం మేడ్చల్ జిల్లా, లాల్‌గడి మలక్‌పేటలో వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేటకు చెందిన నీరుడి శంకరయ్య(56), గేదెల కాపరి. గురువారం గేదెలను కాసి, సాయంత్రం వాటిని ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామపరిధిలోని ఓ బావిలో దూడ ప్రమాదవశాత్తు జారిపడింది. గమణించిన కాపరి శంకరయ్య దూడను కాపాడేందుకు బావిలోకి దిగాడని, పక్కనే ఉన్న గొర్రెల కాపరులు తెలిపారు. దూడ బావిలోంచి బయటకు వచ్చినా, కాపరి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదని ఎస్సై మునీందర్ తెలిపారు.



మలక్‌పేటలోని బావి వద్ద గాలిస్తున్న బలగాలు

చికిత్స పొందుతున్న యాచకుడి మృతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్తు తెలియని యాచకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇబ్రహింపట్నంకు చెందిన ఫిరోజ్‌ఖాన్ ద్విచక్రవాహనంపై జనగాం నుంచి ఇంటికి వస్తుండగా అవుషాపూర్ వద్ద గుర్తు తెలియని యాచకుడి(65)ని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. అదే సమయంలో ఇంటికి వెళ్తున్న బీఆర్ఎస్ భువనగిరి ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి 108 వాహనంతో పాటు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశాడు. 108 వాహనం ఆలస్యం కావడంతో తన సొంత వాహనంలో ఘట్‌కేసర్ ఆస్పత్రికి తరలించాడు. ఫిరోజ్‌ఖాన్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం యాచకుడిని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ యాచకుడు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి అదృశ్యం

జవహర్‌నగర్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం .. మారుతీనగర్‌లో నివసించే సందీప్‌కుమార్(29) నగరంలోని ఓ కారు షోరూంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం సమీప ప్రాంతాలలో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సందీప్‌కుమార్(ఫైల్)

శామీర్‌పేటలో గృహిణి..



లతీఫ్ ఉన్నిస (ఫైల్)

శామీర్‌పేట్: గృహిణి అదృశ్యమైన ఘటన శుక్రవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. శామీర్‌పేట పెద్దమ్మ కాలనీకి చెందిన అబ్దుల్ యూసుఫ్‌తో లతీఫ్ ఉన్నిస(38) వివాహం 2008లో జరిగింది. కాగా వీరికి ఇద్దరు సంతానం. శుక్రవారం యూసుఫ్ వ్యక్తిగత పని నిమిత్తం శామీర్‌పేటకు వెళ్లగా ఇద్దరు పిల్లలతో లతీఫ్ ఉన్నిస ఇంట్లో ఉంది. సాయంత్రం యూసుఫ్ ఇంటికి వెళ్లే సమయానికి పిల్లలు నిద్రలో ఉండగా భార్య లతీఫ్ ఉన్నిస ఇంట్లో లేదు. కాల్ చేయగా ఫోన్ ఇంట్లోనే పెట్టి వెళ్లింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రహదారులకు మరమ్మతులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల రహదారులను మున్సిపల్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కౌన్సిలర్ గూడురు సబితాఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం 7వ వార్డు పరిధిలో సాయిశివనగర్ కాలనీ నుంచి బ్రహ్మయ్యకాలనీకి వెళ్లే రహదారిని జేసీబీ సహాయంతో చదును చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా రహదారి వినియోగంలో లేకపోవడంతో ముళ్లపొదలు, చెట్లు పెరిగిపోయాయని, కాలనీవాసులు రహదారి దుస్థితిని తమ దృష్టికి తీసుకురావడంతో జేసీబీ సహాయంతో రహదారికి మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. వార్డు పరిధిలోని వివిధ వార్డుల్లో ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో విజయవంతం చేసినట్లు చెప్పారు.



రహదారికి మరమ్మతులు చేయిస్తూ..